# సింగిల్ పేజీ కథలు

## పాఠం

**ఏడో తరగతి వారికి తెలుగు క్లాసు రసవత్తరంగా జరుగుతోంది. పిల్లలంతా పూర్తిగా నిమగ్నమై పాఠం వింటున్నారు. ఇంగ్లీషు చదువుల వ్యామోహంలో తెలుగుమీద ఆసక్తి క్రమంగా తరిగిపోతున్న మాట నిజమే అయినా మనసు పెట్టి ఉద్యోగం చేసే ఏ ఉపాధ్యాయుడూ వృత్తిపరంగా 'ఫెయిల్' కాదనేది నిజం.**

"శేషాచలం మాస్టారి క్లాసంటే పిల్లలు చెవి కోసుకుంటారు" ఈ మాట వింటుంటే నా శరీరం పులకరిస్తుంది. ఈ జన్మకి సార్ధకత పొందిన అనుభూతి కలుగుతుంది.

వృత్తిని నమ్ముకున్న ఆ శేషాచలాన్ని నేనే కాబట్టి...

ఇంకొద్ది నిమిషాల్లో పీరియడ్ ముగుస్తుందనగా, అటెండరు భీమశంకరం వచ్చి తలుపు దగ్గర్నుండి చిన్నగా దగ్గాడు తన ఉనికిని తెలియపరుస్తూ.

సాధారణంగా ఎంతో అత్యవసరం ఐతే తప్ప, క్లాసు మధ్యలో నన్నెవరూ డిస్టర్బ్ చేయరు. అలాంటిది.. ఎలాగూ మరో ఐదారు నిమిషాల్లో నేనే బయటకు వచ్చేస్తానని తెలిసి కూడా వచ్చాడంటే కారణం..?

"సార్.. మీ ఇంటి దగ్గర్నుండి ఫోనొచ్చిందండీ" చెప్పాడు.

"ఏమిటి విషయం?" అడిగాను.

"తెలియదండి. అమ్మగారు ఫోన్ చేశారండి. చాలా కంగారుగా మాత్రం ఉన్నారండి. మిమ్మల్ని అర్జెంటుగా అపోలో హాస్పిటల్ దగ్గరికి వచ్చేయమన్నారండి"

నా గుండెలు జారిపోయాయి.

కొంపతీసి నాన్నకి మళ్లీ గుండెపోటు గానీ... మైగాడ్.. అదే జరిగి ఉంటుంది. దేవుడా.. మధ్యతరగతి మానవుడికేమిటీ శిక్ష. ఏమిటీ అగ్నిపరీక్ష. ఆర్నెల్ల క్రితం వచ్చిన గుండెనొప్పికే వేలకి వేలు ఆవిరైపోయాయి. మళ్లీ ఇంతలోనే మరో సమ్మెట పోటా?

ప్రధానాచార్యుల వారి అనుమతి తీసుకుని హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నాను.

వెయిటింగ్ హాల్లో కనిపించింది జానకి. దుఃఖాన్ని బలవంతాన దిగమింగుకుంటూ శోకదేవతలా కూర్చుంది. ఆమె పక్కనే నాన్న!


అంటే...?

నన్ను చూస్తుంటే ఆమెలో దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

ఆమె చెప్పింది వినేసరికి, నాలో నిస్సత్తువ పూర్తిగా ఆవహించింది. ఎలాగో శక్తి కూర్చుకుని డాక్టరుగారి చాంబర్‌వైపు పరిగెత్తాను.

నా ప్రయత్నం వృధా ప్రయాసే అయింది. అరగంట తర్వాత గానీ, పేషెంట్‌ని చూసే అవకాశం రాలేదు.

బెడ్‌మీద నిస్త్రాణగా పడి ఉన్న ఆ వ్యక్తి ప్రణీత్. నా బిడ్డ. పెళ్లయిన పదేళ్లకి పుట్టిన ఏకైక సంతానం. మా వంశాంకురం. నా ఆశల హరివిల్లు. నా కలలకు ఆశాదీపం.



ఇప్పుడు.. ప్రాణాలు నిలబెట్టుకునేందుకు మృత్యువుతో పోరాడుతూ... పాలిపోయిన ముఖంతో... వడలిపోయిన శరీరంతో..

దేవుడా.. నేను నీతిని, నిజాయితీని, మంచిని, మానవత్వాన్నీ నమ్మి ఆచరించడం నిజమైతే, నా బిడ్డను కాపాడు. వాడి క్షేమానికి మించి మాకు ఇంకేమీ అవసరం లేదు.

నా ప్రార్థనలు ఫలిస్తాయా?

విషయం తెలుసుకున్న మా స్కూలు స్టాఫ్ కూడా ఒక్కొక్కరూ వచ్చి చూసి నాకు ధైర్యం చెబుతున్నారు.

రాజగోపాలం సాయంత్రం ఐదవుతుండగా వచ్చాడు తన భార్యతో సహా. అతడు నా బాల్యమిత్రుడు. ఈ హాస్పిటల్‌కి దగ్గర్లోనే ఉంటున్నాడు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ క్లర్క్‌గా చేస్తున్నాడు.

"డాక్టర్లు ప్రమాదమేమీ లేదన్నారుగా. ఇంకెందుకు కంగారు. ఒకట్రెండు రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచి, ఇంటికి పంపేస్తారుగా. నువ్వింక దిగులు పడటం ఆపకపోతే, మీ ఆవిడ మరింత డీలా పడిపోతుంది" నిజానికి రాజగోపాలం ఇచ్చిన సపోర్టు నన్ను కొంత వరకు తేరుకునేలా చేసింది.

ఉదయం నుండి పచ్చి మంచినీళ్లయినా ముట్టని సంగతి తెలుసుకుని, ఆ రాత్రికి తన ఇంట్లోనే భోజనాలు ఎరేంజ్ చేశాడు. జానకి మాత్రం ససేమిరా రానంది. ఆమె కోసం కొరియర్ పంపిస్తానని చెప్పి, నన్ను నాన్నను బలవంతాన ఇంటికి తీసుకుపోయాడు.

అవును.. అతడు 'ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్..'

తనదే అంతంత మాత్రం జీవితమే. ఉన్నంతలోనే మా కోసం వండి వడ్డించిందా ఇల్లాలు.

ఆప్యాయంగా అన్నం పెట్టే ఏ స్త్రీ అయినా 'అమ్మే' నాకు. సందర్భం ఏదైనా కానీ.. మనుషుల్ని కలపడానికి ఏ అనుబంధాలుండాలి.. ఏ రక్తసంబంధం కావాలి.

అన్నం కలుపుకునేందుకు కంచంలో చేయి పెట్టానో లేదో, దిగ్గున తుళ్లిపడ్డాను.. ప్లేటులో బాంబు...

నా శరీరం నిండా చెమటలు...

నా ముఖం ఎంత అసహ్యంగా మారిపోయి ఉంటుందో, రాజగోపాలం కంగారు చూస్తే తెలుస్తోంది. "ఏమైందిరా" అంటూ నన్ను కుదిపేస్తున్నాడు.

"అన్నయ్యా" అంటూ అతడి అర్ధాంగి ఆందోళన.

నా తరపున నాన్న అందుకున్నారు. "వంకాయ కూర చూస్తే వాడికి ఎలర్జీ తల్లీ. వాడికి పదేళ్ల వయసులో ఓసారి వంకాయ కూర తింటూ, ఎందుకో అనుమానం వచ్చి, నోట్లోని గుత్తొంకాయ తీసి చూస్తే, అప్పటికే సగం నమిలేసిన గొంగళి పురుగు, పచ్చిగా రసికారుతూ, మధ్యలోంచి బైటపడింది. ఆ క్షణం నుంచి వాడికి వంకాయంటే అసహ్యమైపోయింది. గత నలభై అయిదేళ్లుగా వంకాయ

# అనుమానం

**అదే చూపు. సందేహం లేదు, వాడు నా వైపే చూస్తున్నాడు. చూస్తుంటే రౌడీలా ఉన్నాడు. నేను గత వారం రోజులుగా కాలేజీ సెంటర్‌కు రావడానికి భయపడుతున్నాను. మా ఇంటికి కాలేజీ సెంటర్ ఫర్లాంగు దూరం. పళ్లు, కాయగూరలు, న్యూస్‌పేపర్ లాంటివి ఏమి కావాలన్నా అక్కడికి వెళ్లాలి. వెళ్లిన ప్రతీసారీ చూపులతో ఈ రౌడీ నన్ను భయపెడుతున్నాడు.**

పది రోజుల క్రితం పోస్టాఫీసులో పాసు బుక్కు నుంచి డబ్బులు తీసుకోవాలని వెళ్తే, అక్కడ క్లర్క్ "ఇప్పుడు డబ్బులు లేవు, రేపు రండి" అని అన్నాడు. మరుసటి రోజు వెళ్లినా అదే సమాధానం. నాకు చాలా కోపం వచ్చి విసుక్కొని, మీపై ఆఫీసులో రిపోర్ట్ చేస్తానని బెదిరించాను. ఆ క్లర్క్ పంపిన మనిషై ఉంటాడు ఈ రౌడీ. అనవసరంగా గొడవ పడ్డాను. వాడు ఎప్పుడు డబ్బులు ఇస్తే అప్పుడు తీసుకోవలసింది. పాపం వాళ్లకీ బోల్డు పని. నా ఒక్కరి కోసం పనిచెయ్యరు కదా! నాలాగ ఎందరో కస్టమర్స్. అయినా నాకు పోస్టాఫీసులో ఎకౌంట్ ఎందుకు? దానిని ఎప్పుడోగానీ ఉపయోగించను. నా ఎకౌంట్ వలన వాళ్లకీ పాపం పని పెరుగుతుంది. ఎకౌంట్ మూసేస్తే బాగుంటుంది. ఈ ఆలోచన ముందుగా వచ్చి ఉంటే, ఈ రౌడీ గొడవ ఉండేది కాదు. ఆ పోస్టాఫీస్ క్లర్క్ చాలా సౌమ్యుడిలా కనబడతాడే! ఇలా రౌడీని పంపి ఉండడు. మరి ఎవరబ్బా ఈ రౌడీ?

ఆ! ఇప్పుడు గుర్తొచ్చింది. గత వారం రోడ్ దాటుతుంటే ఎవడో స్కూటర్‌పై కిందా మీదా చూడకుండా స్పీడ్‌గా వచ్చాడు. అదృష్టం బాగుండి నేను చూసుకొని ఆగాను. అయినప్పటికీ స్కూటర్ హేండిల్ నా చెయ్యికి తగిలింది. వెంటనే ఆవేశంగా తిడుతూ కేకవేశాను. వాడు స్కూటర్ ఆపి, నా వైపు చూసి వెంటనే వెళ్లిపోయాడు. ఆరోజు నేను తిట్టిన తిట్లు వినబడి ఉంటాయి. నన్ను ఏదో చెయ్యాలని ఇలా కాలేజీ సెంటర్ దగ్గర కాపు కాస్తున్నాడు. అయినా రోడ్ దాటినప్పుడు మనం జాగ్రత్తగా ఉండాలి. పాపం, స్కూటర్ మీద స్పీడ్‌గా వచ్చేవాళ్లు



మన కోసం ఆగడం కష్టం కదా! పాపం, వాడి స్కూటర్ బ్రేక్ పనిచేస్తుందో లేదో! మనం ఎదుటివాళ్లను అర్థం చేసుకోవాలి. నేను తిట్టడం తప్పే. అయినా ఈ మాత్రం దానికి ఇలా వెంటపడటం బాగోలేదు. వాడేనా ఈ రౌడీ? ఏమో? మరి వాడు కాకపోతే ఈ రౌడీ ఎవరబ్బా!

వీడు కొబ్బరి బోండాం కొట్టువాడి మనిషి కాదు కదా! గత ఆదివారం ఎప్పటిలాగే నేను, మా ఆవిడ, అమ్మాయి కలసి బోండాం నీరు తాగడానికి వెళ్లాం. ఒక్కొక్క బోండాం ఏడు రూపాయలు, ముగ్గురికీ ఇరవై ఒక్క రూపాయలు అవుతాయి. అయినాసరే ఆరోగ్యానికి మంచిదని వారానికి రెండు, మూడుసార్లు తాగుతాం. ఒక్కొక్కసారి నీరు ఉండవు, అయినా డబ్బులు తగ్గించరు. గొణుక్కుంటూ డబ్బులు ఇస్తాను. ఎప్పటిలాగే ఈసారి ముదురుగా ఉంటే నాకు వద్దని ముందే చెప్పాను. అయినా ముదురు కాయ ఇచ్చాడు. నేను తీసుకోనన్నాను. కొట్టిన బోండాం నేనేమి చేసుకుంటానని వాడంటాడు. ఇలా వాదించుకున్నాం. ఒకవేళ వాడేమయినా మనమీదకు మనిషిని పంపాడా? అనవసరంగా కొబ్బరి బోండాం కోసం గొడవ పడ్డాను.

ఈ రౌడీ గురించి ఇలా ఎన్ని రోజులని భయపడతాం. ఈ రోజు తేల్చుకోవాలని, ఆ రౌడీనే అడిగాను ఎందుకలా చూస్తున్నావని. దానికి వాడు "సార్ మీరు శ్రీనివాస్‌గారు కదా! నేను రమణను.. గుర్తులేనా సార్. మీరు బొబ్బిలిలో పనిచేసినప్పుడు మీ దగ్గర ఒక సంవత్సరం అప్రెంటీస్‌గా చేశాను. ఇప్పుడు ఇక్కడ ఉద్యోగం వచ్చింది సార్. మిమ్మల్ని వారం నుంచి చూస్తున్నాను. మీరు అవునోకాదో అని చిన్న డౌటు. ఈ రోజు మీ గొంతు వినగానే మీరేనని అర్థమయింది. చాలా ఏళ్ల తర్వాత మిమ్మల్ని చూశాను, చాలా ఆనందంగా ఉంది సార్" అని అన్నాడు.

నేను బొబ్బిలి విడిచిపెట్టి చాలా రోజులయింది. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత రమణను గుర్తుపట్టాను. అప్రెంటీస్‌లు ఒక్క సంవత్సరం మాత్రమే పనిచేస్తారు. ప్రతీ సంవత్సరం కొత్త బేచ్ వస్తుంది. అందువలన రమణను వెంటనే గుర్తుపట్టలేకపోయాను.

**-మార్కొండ పట్నాయకుని లక్ష్మి**
**(హైదరాబాద్)**

వాడి శత్రువై పోయింది"

అది వింటూనే పడీపడీ పగలబడి నవ్వాడు రాజగోపాలం. అంతలోనే నవ్వు ఆపి సీరియస్‌గా మారిపోయాడు.

"శేషూ! ఏనాడో యాదృచ్ఛికంగా జరిగిన ఒక సంఘటనని పట్టుకుని, ఇన్నాళ్లయినా, ఇన్నేళ్లయినా, ఎంతో జ్ఞానాన్ని పెంచుకున్నా, వంకాయ పట్ల నీ అభిప్రాయాన్ని మార్చుకోలేకపోయావు. అలాంటిది, ఇప్పుడిప్పుడే జీవితాన్ని అర్థం చేసుకుని, భవిష్యత్తును ప్రేమించడం మొదలుపెట్టిన నీ బిడ్డ, తనకు జీవశాస్త్రం ఇష్టం లేదని, ఆర్ట్స్ గ్రూపు ద్వారా అయ్యేయస్ చేయాలని ఉందని చెప్పినప్పుడు, తను బై.పి.సి. గ్రూప్ తీసుకుని, మెడిసిన్ కోసం ప్రయత్నించాల్సిందేనని, బలవంతాన నీ అభిప్రాయాన్ని రుద్దబోయావ్. ఫలితం.. ఈ రోజు ఉదయం నువ్వు స్కూలుకి వెళ్లే ముందు కూడా నువ్వు అదే మాట కాస్త గట్టిగా చెప్పేసరికి, మనస్తాపం చెంది, పురుగుల మందు తాగేశాడు. వంకాయకి, మెడిసిన్‌కి పోలిక లేకపోయినా వాటి పట్ల మీ తండ్రీకొడుకుల్లో పెరిగిన వ్యతిరేక భావాలు సమానమే.. గదా! ఇంత కన్నా చెప్పేదేం లేదు. ఆలోచించు"

నా కనుల వెంట జలజల రాలుతున్న కన్నీళ్లు. నిజమే.. నేను చవిచూసిన దుర్భర పేదరికాన్ని నా బిడ్డ చూడకూడదనుకున్నాను. నా తల్లి వైద్యం కోసం, తండ్రి హార్ట్ ట్రీట్‌మెంట్ కోసం డాక్టర్ల చుట్టూ తిరుగుతున్నప్పుడు, నా శక్తికి మించినా, నా బిడ్డను కూడా ఓ డాక్టరుగా చేయాలనుకున్నాను. అంకితభావం, సేవా తత్పరతలతో వాడు దేశం గర్వించేలా ఎదిగితే చూసి పులకించిపోవాలనుకున్నాను. నా వైపు ఆలోచనలతో, అతడి అభిరుచిని పట్టించుకోలేకపోయాను. ఈ దేశంలో వేలు, లక్షల మంది తల్లిదండ్రులు చేస్తున్న తప్పునే నేనూ చేశాను. నాకు శత్రువుగా మారడం ఇష్టం లేక నా కొడుకు, తనకి తనే ద్వేషించుకుని, ఈ లోకం వదలిపోవాలనుకున్నాడు.

లక్కీగా.. నాకు తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇంకా ఉంది. నా మోము తేట పడింది. మనసు తేలిక పడింది.

హాస్పిటల్‌కి తిరిగి వచ్చేసరికి ప్రణీత్ తన తల్లితో మాట్లాడుతున్నాడు. ఆప్యాయంగా అతడి నుదుట చుంబించాను. నా భావం అతడి అణువణువులో కొత్త ఉత్తేజం నింపుతుందని తెలుసు.

**-సి.వి.నరసింహదాసు (కోల్‌కతా)**